


RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :304 సంపాదకులు: కలిచేటి వెంకయ్య బుధవారం 30 సెప్టెంబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad









# పెత్తందార్లం కాదు... ప్రజలకు సేవకులం

- దూసుకెళ్తున్న డబులింజన్ పాలన... జెట్ స్పీడ్ వేగంతో అభివృద్ధి
- గ్రామాభివృద్ధిలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేశారు
- ఉదయగిరి పల్లె పండుగ-3.0 బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పల్లె పండుగ-3.0లో భాగంగా రూ.11,085 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం, డిప్యూటీ సీఎం
- వీజీ జీ రాంజీ శ్రామికుల వద్దకెళ్లి శ్రమదానం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్

**ఉదయగిరి సింధూరదర్శిని:** ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గం వరికుంటంపాడు మండలం, రామాపురం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి రూ.11,085 కోట్ల విలువైన గ్రామీణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.పల్లెపండుగ-3.0లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,700 కోట్లతో 6 వేల కిలోమీటర్ల మేర సీసీరోడ్లు, రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనం చేశారు. అలాగే పాడిరైతుల కోసం రూ.300 కోట్లతో 22 వేల మినీ గోకులాలు మిగతా 2లో...

## బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

- ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ
- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న



**హైదరాబాద్ సింధూరదర్శిని:** తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు మిగతా 2లో...

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన



**ఢిల్లీ:** ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే మిగతా 2లో...

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం

- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి


2 లో

## స్థానిక ఎన్నికలు ఆలస్యమంటూ పుకార్లు..

- ఏపీ ఎన్నికల సంఘం కీలక ప్రకటన
- స్థానిక ఎన్నికల షెడ్యూల్ మరో 2 నెలలు ఆలస్యమంటూ వదంతులు
- ఈ ప్రచారాన్ని కొట్టిపారేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అధికారిక ప్రకటనలనే నమ్మాలని ప్రజలకు, పార్టీలకు సూచన
- తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- వార్డుల పునర్విభజనపై ఇటీవల హైకోర్టు గ్రీన్ సిగ్నల్



**అమరావతి సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మరో రెండు నెలల సమయం పడుతుందంటూ వస్తున్న వార్తలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నేడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలు, రాజకీయ పార్టీలు వీటిని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లకు సంబంధించిన కోర్టు కేసులలో స్పష్టత వచ్చాకే కమిషన్ ఎన్నికల ప్రక్రియను మిగతా 2లో...

## 'గెలుస్తామనుకున్నాం.. మరి ఏమైంది?'.. ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలపై రాహుల్ ఆరా!

- కన్నయ్య, జాఖడ్‌లకు రాహుల్ ప్రశ్నలు
- ఎన్నికల వ్యూహంపై వివరణ కోరిన నాయకత్వం
- దీపాంశు షోకీన్ అంశంపైనా చర్చ
- మూడు పదవులు దక్కించుకున్న ఏబీవీపీ
- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఉపాధ్యక్షుడైన షోకీన్



వివరాలు 2 లో









# పెత్తందార్లం కాదు... ప్రజలకు సేవకులం




(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణం, రూ.225 కోట్లతో 50 వేల ఎకరాల్లో ఉద్యాన తోటల పెంపకానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రూ.110 కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పల్లె పండుగ ద్వారా నాందీ పలుకుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్ వేస్తున్నామని... రోడ్ల ఏర్పాటుతో రాకపోకలు సాఫీగా సాగుతాయని... ప్రయాణం సౌకర్య వంతంగా ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.50వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభి ంచామని పల్లెల్లోనూ కనివినీ రీతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం వెల్లడించారు. ప్రజల కళ్లకు కనబడేలా అభివృద్ధి చేస్తున్నా మని... గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే అంశంపై దృష్టి పెట్టామన్నారు. గోకులం షెడ్లు, మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నామని... ప్రతి ఒక్కరికీ ఇల్లు.. ఇంటి స్థలం, విద్యుత్, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రకు గ్రామాలే నాందీ పలకాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని... పేదరికం లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు.. ఆర్థిక అసమానతలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నా మని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

**పల్లె వికాసంలో పవన్ చొరవ అభినందనీయం**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇప్పటికే మూడు పల్లె పండుగ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఉద్యమ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని, పల్లె వికాసంలో ఆయన తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అభినందించారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా పవన్ అనేక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు. రెండున్నర దశాబ్దాల తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలోని వివిధ హోదాల్లో ఉన్న 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేశామని చెప్పారు. లక్షకు పైగా పంటకుంటలు తవ్వించడంతో పాటు పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మించామని వివరించారు. పవన్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. 2024 ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి తాను, పవన్ కళ్యాణ్ ప్రజలకు వద్దకు వచ్చి రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నాడు హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రాన్ని నడిపిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వృథా కాలేదని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి అన్నారు. చెప్పిన విధంగానే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని, జెట్ స్పీడ్‌తో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. సంక్షేమం–అభివృద్ధి–సుపరిపాలనే ఎన్డీఏ ప్రభు త్వ మంత్రమని పేర్కొన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. పేదలకు రూ.5కే అన్నం అందించే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందని, తాము తిరిగి అమలు చేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు, నేతన్నలు, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతు న్నామని, ఆమూల్ బ్రాండ్ స్థాయిలో స్వయం బ్రాండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించానని చెప్పారు. వెలిగొండ ఫేజ్–2 పనులను కూడా పూర్తి చేసి.. ఉదయగిరి నియోజకవర్గాన్ని.. మార్కాపురం జిల్లాను సస్య శ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. హంద్రీ–నీవా ద్వారా రాయలసీమ చివరి భూములకు నీరందిస్తున్నామని, పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లి ప్రాంతానికి నీటిని తీసుకెళు న్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య, ఉద్యాన పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు.

**మరింత సంక్షేమం... మరింత అభివృద్ధి**

విశాఖలో 28 వేల మందికి పైగా కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించామని, విజయవాడలో మరో 24వేల మందికి పట్టాలు అందించను న్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో మూడు లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే పొట్టి శ్రీరాములు జలధార పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్ జీవన్ పనులను భారీ ఎత్తున ప్రారంభించబోతున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించేలా వివిధ రంగాల్లో పరిశ్రమలను తీసుకొస్తూ ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. కృష్ణపట్నం–రామాయపట్నం పోర్టుల మధ్య దగదర్తి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రైల్–రోడ్ కనెక్టివిటిని పెంచి నెల్లూరు–ప్రకాశం జిల్లాలను లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. బీపీసీఎల్ ప్లాంట్ ద్వారా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయని, డిఫెన్స్ పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి వస్తున్నాయని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు, ఉదయగిరి ప్రాంతవాసులు తిరిగి ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించే బాధ్యత తమదని, అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత ప్రజలదని అన్నారు. తమ అభివృద్ధిని చూసి సహకరించాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదైతే.. ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలదని సీఎం చెప్పారు.

**ఉదయగిరి సభలో ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు...**

పల్లె పండుగ–3.0 కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని కీలక ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాల్వ పనులకు రూ.52 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్–1 నిర్మాణానికి అవసరమైన రూ.85 కోట్లు అందిస్తామని తెలిపారు. డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు అవసరమైన క్లియరెన్సులు మంజూరు చేస్తామని, సీబీజీ ప్లాంట్‌కు నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. సోమశిల డ్యామ్ భద్రతకు అవసరమైన నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. క్రాకటూరు డిస్ట్రిబ్యూటరీకి నిధులను సమకూర్చడంతోపాటు... వింజమూరు ప్రాంత పరిధిలో తాగు, సాగునీటి అవసరాల కోసం రాజవోలు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. కనిగిరి ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి.. బీటే రోడ్ల పునర్నిర్మాణానికి వీబీజీ రామ్‌జీ గ్రాంట్ అందిస్తామని చెప్పారు. కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా ఓలేటివారిపాలెం, గూడూరు, లింగసముద్రం మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కనిగిరి–బల్లిపల్లె వద్ద ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుకు సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం కాకొల్లువారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ శ్రమదానం చేశారు. 'వీబీ జీ రాంజీ' శ్రామికుల వద్దకు వెళ్లి పొలాల మధ్య డొంక రోడ్డు పనులను ప్రారంభించారు. కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలనించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద 'వీబీ జీ రాంజీ' శ్రామికులతో కలసి సీఎం, డిప్యూటీ సీఎం, మాధవ్ గ్రూప్ ఫొటో దిగారు. సభ అనంతరం కాకొల్లువారిపాలెం గ్రామంలో పల్లె పండుగ–3.0లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరిశీలించారు. గ్రామస్థులు వారికి పూలు జల్లి ఘన స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూ అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గ్రామస్థులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామ్ నారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహా నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలు ఆలస్యమంటూ పుకార్లు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభిస్తుందంటూ జరుగుతున్న ప్రచారం తమ దృష్టికి వచ్చిందని పునేఠా తెలిపారు. ఎన్నికలు ఆలస్యమైనా, అంతర్గత ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయని కూడా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వార్తలన్నీ కల్పితమైనవని, కమిషన్ అధికారికంగా జారీ చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణ లేని సమాచారాన్ని నమ్మడం గానీ, ఇతరులకు పంపడం గానీ చేయవద్దని సూచించారు. కమిషన్ పేరుతో తప్పుడు, కల్పిత సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఏదైనా ప్రకటన ఉంటే, అది కేవలం అధికారిక ప్రెస్ కాన్ఫరెన్స్ లేదా పత్రికా ప్రకటన ద్వారా మాత్రమే వెల్లడిస్తామని స్పష్టం చేసింది. వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌తో సరిచూసుకున్నాకే విశ్వసించాలని కోరింది. ఇటీవలే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి ప్రారంభించింది. మరోవైపు, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూడా ఎస్ఈసీ సన్నాహాలు కొనసాగిస్తోంది. ఇప్పటికే సెప్టెంబర్ 23తో మండల ప్రజా పరిషత్‌లు, సెప్టెంబర్ 24తో జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## 'గెలుస్తామనుకున్నాం.. మరి ఏమైంది?'.. ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలపై రాహుల్ ఆరా!

**న్యూఢిల్లీ:** ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (డీయూఎస్‌యూ) ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ ఎదుర్కొన్న పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరా తీశారు. ఎన్నికల్లో గెలుపు అంచనాలతో బరిలోకి దిగిన ఎన్ఎస్‌యూఐ ఒక్క కేంద్ర పదవినీ దక్కించుకోక పోవడంతో పార్టీ నాయకత్వం దీనిపై సమీక్ష చేపట్టింది. ఈ క్రమంలో ఎన్ఎస్‌యూఐ ఇన్‌ఛార్జ్ కన్నయ్య కుమార్, జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖడ్‌లతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. సమావేశంలో కన్నయ్య కుమార్, వినోద్ జాఖడ్‌లను రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు అడిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా అధ్యక్ష పదవికి ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి చివరి వరకు గట్టి పోటీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. 'అధ్యక్ష పదవిని గెలిచేందుకు చాలా దగ్గరగా వచ్చాం. తర్వాత ఏం జరిగింది?' అని ఆయన ప్రశ్నించినట్లు వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహం వంటి అంశాలపై కూడా రాహుల్ గాంధీ వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు సమయంలో కన్నయ్య కుమార్ బాధ్యత తీసుకున్నారని కేసీ వేణుగోపాల్ ప్రస్తావించి నట్లు సమాచారం. ఎన్నికల ముందు ఉన్న అంచనాలకు భిన్నంగా ఫలితాలు ఎందుకు వచ్చాయనే దానిపై ఆయన వివరణ కోరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. డీయూఎస్‌యూ కేంద్ర ప్యానెల్‌లో నాలుగు పదవులు ఉన్నాయి. అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను ఏబీవీపీ గెలుచుకుంది. ఉపాధ్యక్ష పదవిని స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ గెలుచుకున్నారు. ఎన్ఎస్‌యూఐ ఒక్క పదవినీ దక్కించుకోలేకపోయింది. మాజీ ఎన్ఎస్‌యూఐ సభ్యుడు దీపాంశు షోకీన్ స్వతంత్రంగా పోటీ చేసి ఉపాధ్యక్ష పదవిని గెలవడం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. 2023, 2024 డీయూఎస్‌యూ ఎన్నికల్లో షోకీన్ ఎన్ఎస్‌యూఐ తరఫున ప్రచారం చేశారు. ఈసారి టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయన 30,615 ఓట్లు సాధించి ఏబీవీపీ అభ్యర్థిపై 13,705 ఓట్ల భారీ తేడాతో గెలిచారు. ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి 4,313 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. షోకీన్‌ను పార్టీలో ఎందుకు కొనసాగించలేకపోయారని రాహుల్ గాంధీ ప్రశ్నించి నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన పెట్టిన కొన్ని షరతులు ఆమోదయోగ్యంగా లేవని కన్నయ్య కుమార్, జాఖడ్ వివరించినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహా రాన్ని నిర్వహించిన తీరుపై రాహుల్ సంతృప్తి చెందలే దని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డీయూఎస్‌యూ అధ్యక్ష పదవిలో ఏబీవీపీకి చెందిన యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించగా, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్‌శంకర్ మీనా 22,523 ఓట్లు పొందారు. దీంతో 2,053 ఓట్ల తేడాతో దబాస్ విజయం సాధించారు. ఈ ఫలితాల నేపథ్యంలో ఎన్ఎస్‌యూఐ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, సంస్థాగత బలం వంటి అంశాలను కాంగ్రెస్ నాయకత్వం సమీక్షిస్తున్నట్లు సమాచారం.

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం: అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం

**ఢిల్లీ:** భారత్–అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగ స్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబ ంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబో దని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్ర మంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటో ందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు.

"అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనల ను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్–అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

### మౌలిక సదుపాయాల అభివృద్ధికి హామీ

చిత్తూరు (సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా; ఎస్.ఎన్. పురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం సందర్శించి, ఆసుపత్రిలోని వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డా. జి. దయాసాగర్ ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన అదనపు భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని వివిధ రికార్డులు, వైద్య పరీక్షల నివేదికలు, ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీ, అలాగే సంజీవని బృందం నిర్వహిస్తున్న సేవలను పరిశీలించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి మెడికల్ ఆఫీసర్ ప్రతిపాదించిన అన్ని అవసరాలను వీలైనంత త్వరగా మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ దయాసాగర్ , ఎం హెచ్ ఓ అనిల్ కుమార్ , ఇంజనీరింగ్ డిప్యూటీ యూపీహెచ్సి , సిబ్బంది పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

### కమిషనర్ వై.ఓ నందన్



నెల్లూరు (సింధూరదర్శిని) 29 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా మంగళవారం రెవిన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పరిపాలనా కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది కార్పొరేషన్ కు చెల్లించవలసిన బకాయిల వసూలు కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అలాగే రెవిన్యూ ఇన్స్పెక్టర్లు ప్రతిరోజు రెవెన్యూ వసూళ్లను పర్యవేక్షించవలసినగా ఆదేశించారు. నగరంలో నూతనంగా నిర్మించిన కొత్త భవనములు, అదనపు అంతస్తులు నిర్మించిన భవనములు, ఖాళీ స్థలములను గుర్తించి ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకురావాల్సిందిగా ఆదేశించారు. 2025 - 26 ప్రస్తుత సంవత్సరము ఎక్కువ శాతం రెవెన్యూ వసూళ్లు కొరకు కృషిచేసిన పరిపాలనా కార్యదర్శులను, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, రెవెన్యూ ఆఫీసర్లను 50 శాతం అంతకు మించి వసూలు చేసిన సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టి.పి.ఆర్.ఓ. వాసు బాబు, రెవిన్యూ ఆఫీసర్లు సమద్, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, పరిపాలనా కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణరథంపై ఊరేగిన గణనాథుడు



కాణిపాకం( సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం నందు మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా సాయంత్రం స్వామివారిని ఆలయ మాడవీధుల్లో వైభవంగా సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని స్వర్ణ (బంగారు) రథం పై ఊరేగింపు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సతీష్, కృష్ణవేణి, అనసూయ, వసంత, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, రవి, ఉభయదారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోవూరు రూరల్ రోడ్లకు రూ.56.20కోట్లు మంజూరు చేయండి

డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వినతి

24 పంచాయతీరాజ్ రోడ్ల పునర్నిర్మాణానికి సవరించిన ప్రతిపాదనలు అందజేత

71.55 కి.మీ. మేర రోడ్లను బీటీ ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి - పల్లెపండుగ 3.0 ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎంకు వినతిపత్రం సమర్పణ

ఉదయగిరి ( సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో మంగళవారం నిర్వహించిన 'పల్లెపండుగ 3.0'కార్యక్రమ ప్రారంభోత్సవంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ కి ప్రశాంతి రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని కలిసి కోవూరు నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల పునర్నిర్మాణానికి రూ.56.20కోట్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.



### 24 గ్రామీణ రహదారుల పునర్నిర్మాణ ప్రతిపాదన

కోవూరు నియోజకవర్గంలో గ్రామీణ రవాణా వసతులను బలోపేతం చేయడంలో భాగంగా 24 పంచాయతీరాజ్ రోడ్ల పునర్నిర్మాణానికి రూ.56.20 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 71.55 కిలోమీటర్ల మేర ఉన్న రహదారులను బి.టి ప్రమాణాలకు అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

### గ్రామీణ ప్రాంతాల రహదారుల దుస్థితి ప్రస్తావన

నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ప్రజలు రోడ్ల దుస్థితిపై తన దృష్టికి పదేపదే తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వినతి పత్రంలో పేర్కొన్నారు. అధ్వానంగా ఉన్న రహదారుల వల్ల ప్రజల రోజువారీ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, రోగులు... మార్కెట్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర అత్యవసర సేవలకు చేరుకోవడంలో ఎన్నో అవరోధాలు ఎదుర్కొంటున్నారని స్పష్టం చేశారు. ఈ రహదారులను వెంటనే పునర్నిర్మించడం ద్వారా గ్రామీణ ప్రజలకు తక్షణ ఉపశమనం లభిస్తుందని, అందుకే ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి ని కోరారు.

### మండలాల వారీగా కేటాయించాల్సిన నిధుల వివరాలు

ఇందుకూరుపేట మండలంలో 22.49 కిలోమీటర్ల మేర ఉన్న 5రోడ్ల నిర్మాణానికి రూ.14.80 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. అలాగే విడవలూరు మండలంలో 13.81 కిలోమీటర్ల మేర ఉన్న 5 రోడ్లకు రూ.11.50 కోట్లు, కోవూరు మండలంలో 13.51 కిలోమీటర్ల మేర ఉన్న 4 రోడ్లకు రూ.10.60 కోట్లు కేటాయించాలని కోరారు. దీనితో పాటు బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 12.23 కిలోమీటర్ల పరిధిలోని 5 రోడ్లకు రూ.10.40 కోట్లు, కొడవలూరు మండలంలో 9.51 కిలోమీటర్ల మేర ఉన్న 5 రోడ్ల పునర్నిర్మాణానికి రూ.8.90 కోట్లు నిధులు కేటాయించాలని లేఖలో కోరారు.

# రామాపురంపల్లె పండుగ-3.0లో మంత్రి నారాయణ ఘాటు వ్యాఖ్యలు

### గొడ్డలి పార్టీకి పరిపాలన చేతకాక వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది



వరికుంటపాడు (సింధూరదర్శిని) నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురంలో నిర్వహించిన పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న విమర్శలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన ఘాటుగా స్పందించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పంచాయతీలు, మున్సిపాలిటీలు నిర్వీర్యమయ్యాయని, గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేశారని మంత్రి నారాయణ విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వెళ్లారని ఆరోపించారు. గొడ్డలి పార్టీకి పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వెళ్లిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అపార అనుభవంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని మంత్రి తెలిపారు. గతంలో చిన్నాభిన్నమైన వ్యవస్థలన్నీ తిరిగి గాడిలో పడుతున్నాయని చెప్పారు. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే వరుసగా పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 2024లో ప్రారంభమైన పల్లె పండుగ మూడు దశల్లో వేల కోట్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. 2024 అక్టోబర్ 14న పల్లె పండుగ-1.0:లో రూ.4,500 కోట్లతో గ్రామీణాభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. 2025 నవంబర్ 26న పల్లె పండుగ-2.0లో రూ.6,787 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

మూడో విడతలో భాగంగా పల్లె పండుగ-3.0:లో రూ.11,085కోట్లతో రామాపురం వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. గత పాలకులు గ్రామాభివృద్ధి కంఠకులుగా మారితే, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కేంద్ర సహకారంతో కూటమి గ్రామవికాసం కోసం పాటుపడు తోందన్నారు. పల్లె పండుగకు అంచనాలకు మించి కూటమి కార్య కర్తలు, అభిమానులు తరలివచ్చారన్నారు. సమన్వయంతో పనిచేసి పల్లెపండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులను మంత్రి అభినందించారు.

# పిల్లలకు స్పోర్ట్స్ కిట్టు పంపిణీ




గూడూరు( సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు జడ్పీ గర్ల్స్ హైస్కూల్ నందు స్పోర్ట్స్ కిట్ రొటేరియన్ వి.మల్లికార్జునరావు. దాతృత్వంతో పిల్లలకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ తిరుమూర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం రోటరీ క్లబ్ ఎక్కువగా స్కూల్స్ నందు పిల్లలకు ఉపయోగకరమైన బెంచీలు స్పోర్ట్స్ కిడ్స్ బుక్స్ ఇవ్వటం జరిగిందని తెలిపారు. మునిగిరీష్ మాట్లాడుతూ రోటరీ సేవలు గురించి రోటరీ క్లబ్ జడ్పీ హైస్కూల్ కు ఎన్నో సేవలు చేసి ఉందని క్లాస్ రూమ్స్ మరియు బెంచెస్ రాక్స్ ఇలాంటి మరెన్నో చేసి ఉన్నారని గుర్తు చేశారు.

సెక్రెటరీ కొసరాజు సునీల్ కుమార్ మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ పోలియోను నిర్మూలించడంలో ప్రముఖ పాత్ర పోషించిందని ఆ కార్యక్రమం చిన్న పిల్లల జీవితాల్లో ఎంతో ఉపయోగకరమైనదని అలాగే రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. జడ్పీ గర్ల్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ మాధవి మాట్లాడుతూ రోటరీ క్లబ్ గూడూరు వారు మా స్కూలుకు ఎన్నో సౌకర్యాలు కల్పించారని పిల్లలకు ఏ అవసరం వచ్చినా రోటరీ క్లబ్ వారిని అడిగిన వెంటనే ఆ సదుపాయాలు కల్పిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గూడూరు ప్రెసిడెంట్ తిరుమూరు సురేష్ రెడ్డి సెక్రటరీ కొసరాజు నాగ సునీల్ కుమార్ దాత రొటేరియన్ మల్లికార్జునరావు, కొణిదల ముని గిరీష్, సీనియర్ రొటీరియల్స్ బి దశరథ రామ్ రెడ్డి, పీవీ కృష్ణయ్య, బండి శ్రీధర్ రెడ్డి,

ఎన్ బాలకృష్ణం రాజు రొటీరియన్స్ పి ప్రసాద్ నాయుడు, బొల్లు రాంప్రసాద్, డి ఆర్ డబ్ల్యు కాలేజ్ ప్రిన్సిపల్ హనుమంతరావు, బలరామిరెడ్డి పాల్గొన్నారు.



# యాలి వాహనం పై ఊరేగిన గణపయ్య

కాణిపాకం (సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి యాలివాహనం సేవ నిర్వహించడం జరిగింది, కాణిపాకం పురవీధుల్లో యాలివాహనంపై విఘ్నాలను కటాచించిన సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, మరియు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఉభయదారులు, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం అత్యంత కీలకం: కాంగ్రెస్ పార్టీ నాయకులు

గూడూరు (సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ వినతిపత్రం గూడూరు ఆర్డిఓ ఏవోకి ఇవ్వడం జరిగింది. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన రాజ్యాంగ సంస్థ. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే విశ్వాసం ప్రతి ఓటరులో ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం. ఎన్నికల సంఘం వ్యవహార శైలికి సంబంధించి రాజకీయ పార్టీలు, ప్రజలు వ్యక్తం చేస్తున్న వివిధ అభ్యంతరాలు మరియు ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నికల ప్రక్రియ పై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకత మరియు నిష్పక్షపాతిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉంది. ఈ నేపథ్యంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు. కావున, ఈ వినతిపత్రాన్ని స్వీకరించి, మా డిమాండ్ ను సంబంధిత ఉన్నతాధికారుల మరియు భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నాము. ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల హక్కులు మరియు ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర ఐయన్ టి యు సి అధ్యక్షులు పూల చంద్ర శేఖర్,గూడూరు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య, మాజీ జిల్లా ప్రదాన కార్యదర్శి చిలుకూరి వేమయ,రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి రావూరి బ్రహ్మయ్య, జిల్లా బిసి విభాగం నాయకులు గంటమడుగు సుబరామరాజు,స్వతంత్రసమరయోదులు మరియు సైదాపురం మండల అధ్యక్షులు మురారి కృష్ణయ్య,యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్,ముత్తుకూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షులు అంకయ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి**

కందుకూరు సింధూర దర్శిని: అంగన్వాడి ఉత్సవం కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మంగళవారం కందుకూరు నియోజకవర్గంలో వల్లేటివారిపాలెం గ్రామంలో ఎంపీడీవో కార్యాలయం నందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తో కలిసి పాల్గొనడం జరిగిందని, అనంతరం గర్భవతులకు శ్రీమంతం చేసి,ఉత్తమ సేవలు అందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను సన్మానించి,మన రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సిబ్బందికి ఇస్తున్న యూనిఫాం ను అందించి,ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, మన రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు మన పిల్లల ఆరోగ్యం కోసం అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని తీసుకోవాలని, గర్భవతులు, బాలింతలు కూడా రక్తహీనత రాకుండా ఉండాలంటే మంచి పోషకాహారం తీసుకోవాలని తెలియజేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్లో ఆకస్మిక తనిఖీ

**అన్ని మౌలిక వసతులు త్వరలో పూర్తి చేస్తాం**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



చిత్తూరు (సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కేటిపల్లి జడ్పీ హైస్కూల్ను అన్ని మౌలిక వసతులు త్వరలో పూర్తి చేస్తాం అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గుడిపాల మండలంలోని కే టి పల్లి జడ్పీ హైస్కూలను ఆకస్మికంగా తనిఖీ చేశారు, ప్రహరీ గోడ నిర్మాణం పనులు, పరిశీలించారు, ల్యాబ్, కంప్యూటర్లు, జడ్పీ హైస్కూల్ కొరకు కావలసిన మౌలిక వసతుల కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినచో జడ్పీ నిధులతో మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో జరుగుతున్న ఎస్ఎంసి ఎన్నికలను పరిశీలించారు, పిల్లల తల్లిదండ్రులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కే. మంజుల, ఎంఈఓ భాష, ఏఈ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ స్టాకింగ్ కంటే సైబర్ స్టాకింగ్ ఎక్కువైంది

**మహిళలు అప్రమత్తంగా ఉండాలి.. వేధింపులు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి**

**మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ**




తిరుపతి( సింధూర దర్శిని) 29 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; ఒకప్పుడు ఫిజికల్ స్టాకింగ్ ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరగడంతో సైబర్ స్టాకింగ్ ఎక్కువవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. సోషల్ మీడియా, ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారా మహిళలను నిరంతరం సంప్రదించడం, వెంటపడటం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి వాటిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో 'స్టాకింగ్ నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా మరో నంబర్ నుంచి పదేపదే కాల్స్, మెసేజ్‌లు చేయడం కూడా స్టాకింగ్‌లో భాగమేనన్నారు. అనుమతి లేకుండా గిఫ్ట్‌లు, బొకేలు పంపడం, మహిళల డీపీలు, ఫొటోలతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, వ్యక్తిగత ఫొటోలు, సమాచారాన్ని దుర్వినియోగం చేసి వేధించడం వంటి చర్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుని నిరంతరం సంప్రదించడం, వెంటపడటం వంటి ఘటనలను తొలిదశలోనే గుర్తించాలని సూచించారు.

### మానసిక బలం కూడా అవసరం

మహిళల భద్రతకు చట్టాలు, పోలీసు వ్యవస్థతో పాటు మానసిక బలం కూడా అవసరమని శైలజ అన్నారు. వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పాలని సూచించారు. 'సమాజం ఏమనుకుంటుంది.. బంధువులు ఏమంటారు' అనే ఆలోచనతో సమస్యను దాచిపెట్టకూడదన్నారు. సమస్యను ముందుగానే గుర్తించి ఫిర్యాదు చేస్తే మరింత తీవ్రం కాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.

### హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన

మహిళలు అత్యవసర సమయంలో 181 మహిళా హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు, 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. జీరో ఎఫ్ఐఆర్‌పై కూడా మహిళలకు అవగాహన అవసరమన్నారు. ఫిర్యాదు సమయంలో అవసరమైతే మహిళా పోలీసు అధికారిని కోరే హక్కు ఉందని చెప్పారు.

### వేధింపులను ఉపేక్షించొద్దు

ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, స్టాకింగ్ వంటి ఘటనలను సాధారణంగా తీసుకోరాదని శైలజ అన్నారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, పోలీసులు, సహాయ వ్యవస్థల అండ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించి, అనుచిత ప్రవర్తన ఎదురైతే తల్లిదండ్రులకు చెప్పేలా ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమంలో తిరుపతి అదనపు ఎస్పీ శ్రీలత, ఎస్ఐ ఏ. జయస్వాములు, న్యాయ నిపుణురాలు డా. కె. శ్రావణి, ఎస్వీ విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం సైకాలజిస్ట్, కౌన్సిలర్ డా. ఎస్. విశ్వనాథ్‌రెడ్డి, మహిళా కమిషన్ సలహాదారు ఆర్. సూయజ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి**





కందుకూరు సింధూర దర్శిని: అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం కందుకూరు నియోజకవర్గశీ వల్లేటివారి పాలెం మండలం, వల్లేటివారిపాలెం గ్రామంలో ఎంపీడీవో కార్యాలయం నందు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మరియు పరిశీలకులు మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు తో కలిసి 20 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని , అనంతరం ముఖ్యమంత్రి సభకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జెండా మోసిన జనసైనికుడికే పట్టం

## స్థానిక పోరులో కార్యకర్తలకు జనసేన కొండంత అండ

**రాజంపేటలో నూతనోత్సాహం నింపిన పరిశీలకుడు, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటన**

**యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ నాయకత్వ పటిమపై ప్రశంసల జల్లు**

**నాయకుల సమన్వయం.. శ్రేణుల్లో కదనోత్సాహం: స్థానిక సంస్థల్లో విజయమే ఏకైక లక్ష్యం**

రాజంపేట సింధూరదర్శిని: పార్టీ కోసం చెమటోడ్చిన ప్రతి కార్యకర్త శ్రమకు తగిన గుర్తింపు లభించే సమయం ఆసన్నమైంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటలో జనసేన పార్టీ తన క్షేత్రస్థాయి బలాన్ని ఘనంగా చాటుకుంది. అధిష్ఠానం ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నియోజకవర్గంలో పర్యటించి, కష్టపడే ప్రతి జనసైనికుడికి పార్టీ ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందన్న బలమైన భరోసానిచ్చారు.

**ఘన స్వాగతం.. నాయకత్వ ప్రతిభకు నిదర్శనం**

రాజంపేటకు విచ్చేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు నియోజకవర్గ ముఖ్య నేతలు యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ తమ తమ కార్యాలయాల వద్ద కార్యకర్తలతో కలిసి అపూర్వ రీతిలో ఘన స్వాగతం పలికారు. రాజంపేటలో జనసేనను అగ్రపథాన నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ చూపిన చొరవ, నిబద్ధత, కార్యకర్తలను ఐక్యంగా నడిపిస్తున్న నాయకత్వ తీరును ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తూ, కేడర్‌కు కొండంత అండగా నిలుస్తున్న వీరిద్దరి నాయకత్వ పటిమపై సమావేశంలో ప్రశంసల జల్లు కురిసింది.

**తోట కల్యాణ మండపంలో కార్యకర్తల ఆత్మీయ మంథనం**

తోట కల్యాణ మండపంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం కేవలం రాజకీయ వ్యూహాల చర్చకే పరిమితం కాకుండా, కార్యకర్తల మనోభావాలను తెలుసుకునే ఆత్మీయ వేదికగా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ జెండాను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న జనసైనికుల అభిప్రాయాలను నేరుగా సేకరించారు. గ్రామ, మండల స్థాయిల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, గెలుపు అవకాశాలు, స్థానిక సమీకరణాలపై లోతుగా చర్చించారు.

**కష్టపడే జనసైనికులకే ఎన్నికల్లో ప్రాధాన్యం: ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భరోసా**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ



**క్షేత్రస్థాయి శ్రేణుల్లో సంపూర్ణ ఆత్మవిశ్వాసాన్ని నింపారు:** కష్టకాలంలో నిస్వార్థంగా పార్టీ జెండాను భుజాన మోసిన నిజమైన జనసైనికులు, వీరమహిళల శ్రమకు తగిన గుర్తింపు దక్కుతుంది.

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి సముచిత స్థానం కల్పించి ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దడమే పార్టీ ధ్యేయం.**

యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ వంటి స్థానిక నాయకుల సమన్వయంతో రాజంపేట నియోజకవర్గంలో జనసేన బలమైన శక్తిగా ఎదిగింది. పార్టీ పటిష్టంగా ఉన్న ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో సమర్థులైన స్థానిక కార్యకర్తలను బరిలోకి దించి విజయఢంకా మోగిస్తాం. గ్రామ, మండల స్థాయిల్లో కార్యకర్తల అభిప్రాయాలే గీటురాయిగా అభ్యర్థుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుంది.

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటన, స్థానిక నాయకుల సమన్వయంతో రాజంపేట జనసేన శ్రేణుల్లో సరికొత్త జోష్ వెల్లివిరిసింది. నాయకుల ఐక్యత, అధిష్ఠానం ఇచ్చిన కొండంత అండతో స్థానిక సమరంలో తిరుగులేని విజయం సాధిస్తామని శ్రేణులు ముక్తకంఠంతో చాటిచెప్పాయి.

?ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, జనసేన ప్రముఖ నేతలు యల్లటూరి శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ, శివరామరాజు, తాతంశెట్టి నాగేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## త్వరలో ఈఎంఐలు పెరగక తప్పదా?

**ఆర్‌బీఐపై పెరుగుతున్న ఒత్తిడి!**

**వడ్డీ రేట్ల పెంపు విషయంలో ఆర్‌బీఐపై పెరుగుతున్న ఒత్తిడి**

**చమురు ధర 100 డాలర్లు దాటడంతో కొత్త సవాళ్లు**

**రెండు వారాల్లో దాదాపు ఒక శాతం బలహీనపడ్డ రూపాయి**

**రేట్లు పెరిగితే ఫ్లోటింగ్ రుణాలపై ప్రభావం**

**ఈయూ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ సైతం జపాన్ వడ్డీరేట్లు పెంచిన వైనం**

లోన్లు తీసుకున్న వారికి ఈఎంఐల భారం పెరగబోతుందా? ప్రస్తుతం ఆర్థిక మార్కెట్లలో ఇదే ప్రశ్న వినిపిస్తోంది. పెరుగుతున్న ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, అంతర్జాతీయంగా పెరుగుతున్న వడ్డీ రేట్లు 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ)పై ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఆర్‌బీఐకి తగ్గుతోందని 'బీఎన్‌పీ పరిబాస్ ఇండియా' నివేదిక తెలిపింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటింది. అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ ఈల్డ్ కూడా ఐదు శాతానికి చేరువైంది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగితే చమురు ధరలు ఇంకా పైకి వెళ్లే అవకాశం ఉంది. ఇది భారత్‌లో ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపొచ్చని నివేదిక పేర్కొంది. మరోవైపు యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల చొప్పున పెంచాయి. ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరిగితే భారత్ నుంచి పెట్టుబడులు బయటకు వెళ్లే ఒత్తిడి పెరుగుతుంది. రూపాయి ఇప్పటికే దాదాపు ఒక శాతం బలహీనపడింది.

**ఈఎంఐలపై ప్రభావం ఎలా?**

ద్రవ్యోల్బణం మరింత పెరిగి.. రూపాయిపై ఒత్తిడి కొనసాగితే ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై కఠిన వైఖరి అవలంబించాల్సిన పరిస్థితి రావొచ్చు. అలా జరిగితే బ్యాంకులు రుణాలపై వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఫ్లోటింగ్ రేట్ గృహ, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారిపై ప్రభావం పడొచ్చు. దీంతో ఈఎంఐ పెరగడం లేదా లోన్ టెన్యూర్ పెరగడం జరిగే అవకాశం ఉంటుంది. దేశంలో రుణ వృద్ధి, వాహన అమ్మకాలు, ఉద్యోగ గణాంకాలు కొంత సానుకూలంగా ఉన్నా.. పట్టణాల్లో వేతనాలు తగ్గడం, వ్యాపార విశ్వాసం బలహీనపడటం, గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తున్నాయని బీఎన్‌పీ పరిబాస్ తెలిపింది.

## ఆసియా క్రీడలు: షూటింగ్‌లో నీరూ దండాకు స్వర్ణం.. భారత్ ఖాతాలో ఐదో గోల్డ్!

**మహిళల ట్రాప్ షూటింగ్‌లో సత్తా చాటిన నీరూ దండా**

**మహిళల షూటింగ్ జట్టుకు రజత పతకం**

**47కు చేరిన భారత్ మొత్తం పతకాల సంఖ్య**

**బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో మరిన్ని పతకాలపై ఆశలు**



ఐచీ-నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భారత షూటర్ నీరూ దండా అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఏకాగ్రత కోల్పోకుండా అద్భుతంగా గురిపెట్టిన నీరూ, మహిళల ట్రాప్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో పసిడి పతకాన్ని ముద్దాడారు. ఈ క్రీడల్లో భారత్‌కు ఇది ఐదో స్వర్ణం కాగా, షూటింగ్‌లో వ్యక్తిగత విభాగంలో ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. పదవ రోజు పోటీల్లో భాగంగా నీరూ అద్భుత ప్రదర్శనతో పాటు మహిళల ట్రాప్ జట్టు రజత పతకాన్ని సాధించి సత్తా చాటింది. అయితే, పురుషుల ట్రాప్ జట్టు పతకాన్ని త్రుటిలో చేజార్చుకుంది. పురుషుల జట్టులో షపత్ భరద్వాజ్ వ్యక్తిగత ఫైనల్‌కు అర్హత సాధించి ఆశలు రేకెత్తించాడు. ఈ స్వర్ణంతో కలిపి భారత్ పతకాల సంఖ్య 47కి చేరింది. ఇందులో 5 స్వర్ణాలు, 21 రజతాలు, 21 కాంస్య పతకాలు ఉన్నాయి. మరోవైపు, అథ్లెటిక్స్ లో గుల్వీర్ సింగ్, అవినాశ్ సాబ్లే వంటి క్రీడాకారులు పతకాల కోసం పోటీ పడనున్నారు. బాక్సింగ్‌లో పర్వీన్, అంకుశ్ పంఘల్, నరేందర్ సెమీఫైనల్‌కు చేరి, దేశానికి మరో మూడు పతకాలను ఖాయం చేశారు.

## నారాయణస్వామి అన్నదాన పథకానికి రూ.1,00,001లు విరాళం

**దాతలు కుందూరు కుటుంబసభ్యులకు అభినందనలు**

సిసిపురం సింధూరదర్శిని: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం నందు అన్నప్రసాద వితరణకు పామూరు మండలం చట్టమడుగు గ్రామవాస్తవ్యులు కుందూరు శివ రామయ్య చౌదరి, జయలక్ష్మి దంపతులు కుమారుడు కుందూరు బాలకృష్ణ, రాజ్యలక్ష్మి దంపతులు 1,00,001 రూపాయలు విరాళం అందజేసినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజ నరసింహబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం 2,00,309 రూపాయలు వచ్చినట్లు వీటిలో పూజాటికెట్లు విక్రయం ద్వారా 54,170 లడ్డుప్రసాదం అమ్మకం ద్వారా 22,340 శాశ్వత అన్నదాన పథకానికి 1,23,799 మొత్తం 2,00,309 రూపాయలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈసందర్భంగా శాశ్వత అన్నదాన పథకానికి 1,00,001 రూపాయలు విరాళం అందజేసిన దాతలు కుందూరు శివరామయ్య చౌదరి, జయలక్ష్మి దంపతులు కుమారుడు కుందూరు బాలకృష్ణ, రాజ్యలక్ష్మి దంపతులను ఈఓ స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# అమెరికా చరిత్రలోనే ఎస్సార్ అతిపెద్ద స్టీల్ ప్రాజెక్ట్.. ఎవరీ రుయా సోదరులు?

**అమెరికాలో స్టీల్ ప్లాంట్ కోసం ఎస్సార్ గ్రూప్ 18 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి**

**1969లో ఈ గ్రూపును స్థాపించిన శశి రుయా, రవి రుయా సోదరులు**

**చెన్నైలో చిన్న కాంట్రాక్టుతో మొదలై ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన సంస్థ**

**భారీ అప్పుల తర్వాత ఎస్సార్ స్టీల్, ఎస్సార్ ఆయిల్ విక్రయించి ఇప్పుడు పెట్టుబడులు**

**అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్రాజెక్టుగా దీనికి గుర్తింపు**



ఒకప్పుడు చిన్న నిర్మాణ సంస్థగా మొదలైన భారతీయ కంపెనీ ఒకటి, ఇప్పుడు అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైంది. ఆ కంపెనీయే ఎస్సార్ గ్రూప్. శశి రుయా, రవి రుయా అనే ఇద్దరు సోదరులు స్థాపించిన ఈ సంస్థ, అమెరికాలో ఉక్కు రంగంలో సుమారు 18 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 1.4 లక్షల కోట్లు) భారీ పెట్టుబడి పెట్టబోతోంది. ఈ ప్రాజెక్టును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా చరిత్రలోనే అతిపెద్దదిగా అభివర్ణించడం దీని ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

**చెన్నై పోర్టు నుంచి ప్రపంచ స్థాయికి...**

ఎస్సార్ గ్రూప్ ప్రస్థానం 1969లో చెన్నైలో మొదలైంది. శశి, రవి రుయా సోదరులు తమ తండ్రి నంద్ కిశోర్ రుయా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, చెన్నై పోర్టులో ఔటర్ బ్రేక్‌వాటర్ నిర్మాణానికి రూ. 2.5 కోట్ల కాంట్రాక్టుతో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. తమ పేర్లలోని మొదటి అక్షరాలైన 'ఎ' (శశి), '=' (రవి) కలిసొచ్చేలా 'ఎస్సార్' (ఇంగ్లీషు) అని కంపెనీకి నామకరణం చేశారు. అక్కడి నుంచి ఈ గ్రూప్ వెనుదిరిగి చూసుకోలేదు. షిప్పింగ్, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్, విద్యుత్, పోర్టులు, టెలికాం వంటి అనేక రంగాల్లోకి విస్తరించి, ప్రపంచవ్యాప్తంగా దూకుడుగా పెట్టుబడులు పెట్టే భారతీయ సంస్థల్లో ఒకటిగా నిలిచింది. సోదరుల్లో పెద్దవాడైన శశి రుయా గ్రూప్ విస్తరణలో కీలక పాత్ర పోషించారు. ఆయన నవంబర్ 2024లో తన 80వ ఏట కన్నుమూశారు. ఇంజినీర్ అయిన చిన్న సోదరుడు రవి రుయా, సంస్థ కార్యకలాపాలను ఏకీకృతం చేయడంతో పాటు అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా దేశాలకు వ్యాపారాన్ని విస్తరించడంలో ప్రధాన భూమిక పోషించారు.

**రుణాల సంక్షోభం నుంచి పునరుజ్జీవం**

భారత ఆర్థిక వ్యవస్థ సరళీకరణ తర్వాత ఎస్సార్ గ్రూప్ వేగంగా విస్తరించినప్పటికీ, అదే స్థాయిలో భారీ అప్పుల్లో కూరుకుపోయింది. ముఖ్యంగా, ఎస్సార్ స్టీల్ ఇండియా దివాలా తీయడంతో, దానిని ఆర్సెలార్ మిట్టల్-నిప్పాన్ స్టీల్ సంస్థకు విక్రయించాల్సి వచ్చింది. అలాగే, ఎస్సార్ ఆయిల్ సంస్థను 12.9 బిలియన్ డాలర్లకు అమ్మివేసి, ఆ వచ్చిన నిధులతో రుణ భారాన్ని గణనీయంగా తగ్గించుకున్నారు. ఈ వ్యూహాత్మక విక్రయాల తర్వాత ఎస్సార్ గ్రూప్ ఇప్పుడు అమెరికాపై దృష్టి సారించింది. ఇప్పటికే మిన్నెసోటాలో 'మెసాబి మెటాలిక్స్' పేరుతో ఇనుప ఖనిజం తవ్వకాలు ప్రారంభించింది. గత 50 ఏళ్లలో అమెరికాలో మొదలైన మొట్టమొదటి కొత్త ఇనుప ఖనిజ గని ఇదే కావడం విశేషం. తాజాగా ప్రకటించిన అయోవా స్టీల్ ప్లాంట్, ఈ మిన్నెసోటా గనుల నుంచి వచ్చే ముడిసరుకును వినియోగించుకోనుంది. ఏటా 10 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఈ ప్లాంటును నిర్మించనున్నారు. 2030 నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రవి రుయా కుమారుడు రేవంత్ రుయా, ఇతర కుటుంబ సభ్యులు ఈ కొత్త తరం వ్యాపార కార్యకలాపాల్లో చురుగ్గా పాలు పంచుకుంటూ సంస్థ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు.

# తల తెగిపోయినా వారం కంటే ఎక్కువ బతకగలిగే జీవి ఏదో తెలుసా?

**తల లేకపోయినా కొంతకాలం బతకగలిగే బొద్దింక - సుమారు వారం వరకు బతకగలవని ఆధారాలు**

**స్పైరాకిల్స్ ద్వారా శ్వాస తీసుకునే వ్యవస్థ - తల తెగినా వెంటనే తీవ్రమైన రక్తస్రావం జరగని శరీర నిర్మాణం**

**శరీరంలోని గ్యాంగ్లియా వ్యవస్థ వల్ల కదలికలు సాధ్యం**



బొద్దింక.. పేరు వింటేనే చాలామందికి చిరాకు. ఇంట్లో వంటగదిలోనో, బాత్‌రూమ్‌లోనో రాత్రిపూట హఠాత్తుగా కనిపిస్తే చాలు.. దాన్ని తరిమేయడమే పని. కానీ ఈ చిన్న పురుగు గురించి కొన్ని విషయాలు తెలిస్తే మాత్రం ఆశ్చర్యపోవాల్సిందే. వాటిలో ముఖ్యమైనది తల లేకపోయినా కొంతకాలం బతకగలగడం. సాధారణ పరిస్థితుల్లో తల కోల్పోయిన బొద్దింక సుమారు వారం రోజుల వరకు బతికిన సందర్భాలు ఉన్నాయి. ఇంతకీ తల లేకుండా అది ఎలా బతుకుతుంది?

**శ్వాసకు తల అవసరం లేదు**

మనుషులు ముక్కు, నోటి ద్వారా శ్వాస తీసుకుంటారు. బొద్దింకలకు అలా కాదు. వాటి శరీరం పక్క భాగాల్లో చిన్న చిన్న రంధ్రాలు ఉంటాయి. వీటినే స్పైరాకిల్స్ అంటారు. వీటి ద్వారా గాలి లోపలికి వెళ్లి శరీరంలోని శ్వాస వ్యవస్థకు చేరుతుంది. అందుకే తల పోయినా శరీరం వెంటనే శ్వాస ఆపేయదు. కొంతకాలం వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

**రక్తస్రావంతో వెంటనే చనిపోదు**

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఉంది. మనుషుల శరీరంలో రక్తం రక్తనాళాల ద్వారా ఒత్తిడితో ప్రవహిస్తుంది. బొద్దింకల రక్త ప్రసరణ వ్యవస్థ అలా ఉండదు. వాటికి ఓపెన్ సర్క్యులేటరీ సిస్టమ్ ఉంటుంది. దీంతో తల తెగిపోయిన వెంటనే మనుషుల్లో మాదిరిగా తీవ్రమైన రక్తస్రావం జరగదు. గాయం కూడా కొంతవరకు మూసుకుపోతుంది. దీంతో శరీరం వెంటనే పనిచేయడం ఆపదు.

**మెదడు లేకపోయినా కదులుతుందా?**

అవును.. కొంతసేపు కదలగలదు. కారణం బొద్దింక నాడీ వ్యవస్థ మొత్తం మెదడుపైనే ఆధారపడి ఉండదు. శరీరంలోని వివిధ ప్రాంతాల్లో గ్యాంగ్లియా అనే నాడీకణాల సమూహాలు ఉంటాయి. ఇవి కొన్ని ప్రాథమిక కదలికలను నియంత్రించగలవు. అందుకే తల లేని బొద్దింక కదలడం లేదా తాకినప్పుడు స్పందించడం కనిపించొచ్చు.

**మరి ఎక్కువకాలం ఎందుకు బతకదు?**

తల లేకపోవడం వల్ల ఒక పెద్ద సమస్య మాత్రం తప్పదు. నోరు లేకపోవడంతో ఆహారం తీసుకోలేదు. నీరు కూడా తాగలేదు. ఆహారం లేకుండా బొద్దింకలు చాలాకాలం ఉండగలవు. కానీ నీరు అందకపోతే మాత్రం చివరకు చనిపోతాయి. అందుకే తల లేకుండా వారం రోజుల వరకు బతకగలదని చెప్తారు.. అది ఎప్పటికీ అలా జీవించగలదని కాదు. ఎంతకాలం బతుకుతుందనేది ఉష్ణోగ్రత, తేమ వంటి పరిస్థితులపై కూడా ఆధారపడి ఉంటుంది.

**నీటిలోనూ కొంతసేపు ఉండగలదు**

బొద్దింకల శరీర నిర్మాణంలో మరో ఆసక్తికరమైన విషయం ఉంది. అవసరమైనప్పుడు స్పైరాకిల్స్‌ను మూసుకోవడం ద్వారా కొంతసేపు నీటిలో ఉండగలవు. కొన్ని పరిస్థితుల్లో ఇవి 30 నుంచి 40 నిమిషాల వరకు నీటిలో ఉండగలవని చెబుతారు.

# గణాంకాల కోసం ఆడితే ఎక్కువ కాలం కొనసాగలేం: కోహ్లీ

**వన్డేల్లో 15,000 పరుగుల మైలురాయిని అందుకున్న కోహ్లీ - సచిన్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడు**

**రికార్డుల కోసం కాకుండా జట్టు గెలుపు కోసమే ఆడతానని స్పష్టీకరణ**



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో మరో చారిత్రాత్మక మైలురాయిని అందుకోవడం తెలిసిందే. వన్డే ఫార్మాట్‌లో 15,000 పరుగులు పూర్తి చేసుకున్న రెండో ఆటగాడిగా, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సరసన నిలిచాడు. అయితే, తన సుదీర్ఘ కెరీర్‌కు, నిలకడైన ప్రదర్శనకు కారణం రికార్డులు కాదని, జట్టును గెలిపించాలనే తపన మాత్రమేనని కోహ్లీ స్పష్టం చేశాడు. తాజాగా బీసీసీఐ.టీవీతో మాట్లాడిన కోహ్లీ తన విజయ రహస్యాన్ని పంచుకున్నాడు. "సంఖ్యల పరంగా చూస్తే ఇది చాలా పెద్ద మైలురాయి. కానీ, నా లక్ష్యం చాలా స్పష్టమైనది. కష్టమైన పరిస్థితుల్లో, విభిన్న సవాళ్లను ఎదుర్కొని జట్టును గెలిపించేందుకే నా ప్రయత్నం. ఇన్నేళ్లుగా నేను అదే చేస్తున్నాను" అని వివరించాడు. కేవలం గణాంకాల కోసం ఆడితే ఏ ఆటగాడూ ఎక్కువ కాలం కెరీర్‌లో కొనసాగలేడని 37 ఏళ్ల కోహ్లీ అభిప్రాయపడ్డాడు. "మీరు జట్టును గెలిపించాలని చూస్తేనే ఇంతకాలం ఆడగలరు. కేవలం గణాంకాల కోసమే అయితే ఎక్కువ కాలం ఆడలేరు. ఎందుకంటే, గణాంకాలపై దృష్టి పెడితే ప్రధాన లక్ష్యం దెబ్బతింటుంది. ఆ పద్ధతిలో ఎక్కువ కాలం కొనసాగడం అసాధ్యం. ఈ స్థాయిలో ఆడటం నా అదృష్టం. జట్టు విజయం సాధించే క్రమంలో ఇలాంటి మైలురాయిని అందుకోవడం చాలా ప్రత్యేకం" అని పేర్కొన్నాడు. కాగా, కోహ్లీని ఎంతో ఆరాధించే భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఈ చారిత్రాత్మక క్షణంలో అతనితో కలిసి ఉండటంపై ఆనందం వ్యక్తం చేశాడు.

# కివీ పండును ఇలా తింటేనే పూర్తి పోషకాలు లభిస్తాయట!

**కివీని తొక్కతో తింటేనే ఫైబర్ ఎక్కువగా లభిస్తుందంటున్న నిపుణులు**

**పచ్చి కివీ తొక్కలో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు - తొక్కపై వెంట్రుకల్లాంటివి ఉంటే టవల్‌తో రుద్దితే మేలు**

**గోల్డెన్ కివీ తొక్క తినడానికి మరింత సులభం - రోజుకు రెండు కివీలు జీర్ణక్రియకు ఉపయోగపడొచ్చని సూచన**

పచ్చగా.. జ్యూసీగా ఉండే కివీ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చాలామందికి తెలుసు. అయితే కివీని ఎలా తింటున్నారు? తొక్క తీసేసి లోపలి గుజ్జు మాత్రమే తింటున్నారా? అలా చేస్తే కివీలో ఉండే కొన్ని ముఖ్యమైన పోషకాలను కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కివీని ఎంచుకోవడం దగ్గర నుంచి తినే విధానం వరకు కొన్ని చిన్న మార్పులు చేస్తే మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చని సూచిస్తున్నారు.



**పచ్చి కివీని తొక్కతోనే తినొచ్చా?**

పచ్చి కివీపై చిన్న చిన్న వెంట్రుకల్లాంటి పొర ఉంటుంది. అందుకే చాలామంది తొక్క తీసేసి తింటారు. కానీ తొక్కతో కలిపి తింటే ఫైబర్ ఎక్కువగా లభిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ కూడా అధికంగా అందుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియకు ఇది ఉపయోగపడొచ్చు. మలబద్ధకం సమస్య ఉన్నవారికి మల విసర్జన సక్రమంగా ఉండటంలోనూ సహాయపడే అవకాశం ఉంది.

**పొర నచ్చకపోతే ఇలా చేయండి**

కివీ తొక్కపై ఉండే వెంట్రుకలు తినడం ఇబ్బందిగా అనిపిస్తే ముందుగా పండును నీటితో బాగా కడగాలి. తర్వాత శుభ్రమైన కిచెన్ టవల్‌తో మెల్లగా రుద్దాలి. దీంతో బయట ఉండే అదనపు వెంట్రుకలు కొంతవరకు తొలగిపోతాయి. ఆ తర్వాత పలుచని ముక్కలుగా కోసుకుని తొక్కతోనే తినొచ్చు.

**గోల్డెన్ కివీ అయితే మరింత సులభం**

గోల్డెన్ కివీ తొక్క పచ్చి కివీతో పోలిస్తే పలుచగా, మెత్తగా ఉంటుంది. దీనిపై వెంట్రుకలు కూడా దాదాపు ఉండవు. అందుకే తొక్కతోనే తినడం సులభం. తొక్కతో తింటే కేవలం గుజ్జు తినడంతో పోలిస్తే ఫైబర్, విటమిన్-ఈ, ఫోలేట్ ఎక్కువగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**రోజుకు ఎన్ని కివీలు తినాలి?**

రోజుకు రెండు కివీలు తినడం జీర్ణవ్యవస్థకు ఉపయోగపడొచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నాలుగు వారాల పాటు రోజుకు రెండు కివీలు తీసుకున్నవారిపై జరిగిన ఓ అధ్యయనంలో మల విసర్జన మరింత సక్రమంగా జరిగినట్లు గుర్తించారు. మల విసర్జన సులభంగా ఉండటంతో పాటు జీర్ణక్రియకు సంబంధించిన అసౌకర్యం కూడా తగ్గినట్లు అధ్యయనంలో పాల్గొన్నవారు తెలిపారు.

**కివీకి ఫైబర్‌తో పాటు మరో ప్రత్యేకత**

కివీలో కరిగే ఫైబర్‌తో పాటు ప్రీబయాటిక్ ఫైబర్ కూడా ఉంటుంది. ఇది పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేస్తుంది. దీంతో పేగుల ఆరోగ్యానికి మద్దతు లభించొచ్చు. సాధారణ ఫైబర్ సప్లిమెంట్లు ప్రధానంగా మలానికి పరిమాణాన్ని పెంచేలా పనిచేస్తే.. కివీలో ఉండే వివిధ రకాల ఫైబర్ పేగుల పనితీరుకు మరింత విస్తృతంగా తోడ్పడే అవకాశం ఉంది. అయితే ప్రతి ఒక్కరి జీర్ణవ్యవస్థ ఒకేలా స్పందించదు. కివీ తిన్న తర్వాత అసౌకర్యం, అలర్జీ వంటి సమస్యలు కనిపిస్తే తినడం ఆపి వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# ఇన్‌కమ్ ప్రూఫ్ లేకుండానే క్రెడిట్ కార్డు పొందొచ్చా? ఈ మార్గాలు తెలుసుకోండి!

**బ్యాంకుతో చాలా కాలం నుంచి సంబంధం ఉంటే ఉపయోగపడే అవకాశం - ఐటీఆర్, ఫారం-16, బ్యాంక్ స్టేట్‌మెంట్లతోనూ కార్డు పొందే ఛాన్స్**

**మంచి క్రెడిట్ చరిత్ర కూడా సహాయపడొచ్చంటున్న ఆర్థిక నిపుణులు - ఎఫ్‌డీపైనా సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు తీసుకునే వెసులుబాటు - యాడ్‌ఆన్ కార్డు కూడా మరో మార్గం**

జీతం వస్తుంటే.. శాలరీ స్లిప్ ఉంటే క్రెడిట్ కార్డు తీసుకోవడం సాధారణంగా సులభమే. కానీ స్వయం ఉపాధి చేసుకునేవారు, స్థిరమైన ఆదాయం లేనివారు, ఉద్యోగం మారే సమయంలో ఉన్నవారు ఏం చేయాలి? ఆదాయానికి సంబంధించిన సాధారణ పత్రాలు లేకపోతే క్రెడిట్ కార్డు రాదా? అలా అనుకోవాల్సిన అవసరం లేదు. కొన్ని ప్రత్యామ్నాయ మార్గాల్లో కార్డు పొందే అవకాశం ఉంటుంది.



**బ్యాంకు నిబంధనలే కీలకం**

క్రెడిట్ కార్డు ఇవ్వాలా? వద్దా? అన్నది ప్రతి బ్యాంకు తన నిబంధనల ప్రకారం నిర్ణయిస్తుంది. ఆదాయం ఒక్కటే ప్రమాణం కాదు. దరఖాస్తుదారుడి ఆర్థిక పరిస్థితి, క్రెడిట్ చరిత్ర, బ్యాంకుతో ఉన్న సంబంధం వంటి అంశాలను కూడా పరిశీలిస్తారు. ఆదాయానికి ఆధారం లేని వారికి క్రెడిట్ రిస్కును బ్యాంకులు స్వయంగా అంచనా వేయాలని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నాయి.

**ఇప్పటికే బ్యాంకుతో సంబంధం ఉంటే..**

మీకు ఇప్పటికే ఒక బ్యాంకులో ఖాతా ఉంటే కొంత ప్రయోజనం ఉండొచ్చు. ఖాతాలో జరిగే లావాదేవీలు, డిపాజిట్లు, గత చెల్లింపుల వివరాలు బ్యాంకుకు అందుబాటులో ఉంటాయి. వీటి ఆధారంగా కొందరికి ముందస్తుగా ఆమోదించిన క్రెడిట్ కార్డు ఆఫర్ రావచ్చు. ఇలాంటి సందర్భాల్లో అదనపు పత్రాలు తక్కువగా ఉండొచ్చు.

**మంచి క్రెడిట్ స్కోర్ ఉపయోగపడుతుంది**

ఇప్పటికే రుణం లేదా మరో క్రెడిట్ కార్డు ఉండి, చెల్లింపులను సకాలంలో చేస్తుంటే అది మీ క్రెడిట్ చరిత్రలో కనిపిస్తుంది. దీంతో మీ గత ఆర్థిక చరిత్రను బ్యాంకు అంచనా వేయగలదు. అయితే మంచి క్రెడిట్ స్కోర్ ఉన్నంత మాత్రాన ఆదాయ ధ్రువీకరణ అవసరం లేదని మాత్రం చెప్పలేం.

**శాలరీ స్లిప్ ఒక్కటే ఆధారం కాదు**

ఆదాయాన్ని నిర్ధారించేందుకు శాలరీ స్లిప్ ఒక్కటే మార్గం కాదు. కొన్ని బ్యాంకులు ఐటీఆర్, ఫారం-16, బ్యాంక్ స్టేట్‌మెంట్ల వంటి పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాయి. అవసరమైన పత్రాలు దరఖాస్తుదారుడి అర్హత, బ్యాంకు నిబంధనలపై ఆధారపడి మారొచ్చు.

**ఎఫ్‌డీపై క్రెడిట్ కార్డు**

స్థిరమైన ఆదాయం లేకపోతే ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఆధారంగా వచ్చే సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు మరో మార్గం. ఇందులో ముందుగా బ్యాంకులో ఎఫ్‌డీ చేస్తారు. దాని ఆధారంగా క్రెడిట్ కార్డు జారీ చేస్తారు. ఎఫ్‌డీ బ్యాంకుకు భద్రతగా ఉండటంతో ఆదాయంపై ఆధారపడే అవసరం కొంత తగ్గుతుంది.సాధారణంగా కార్డు పరిమితి ఎఫ్‌డీ మొత్తానికి అనుసంధానమై ఉంటుంది. ఎఫ్‌డీ మీ డబ్బే అయినా.. కార్డు కొనసాగుతున్నంతకాలం దానిపై బ్యాంకు హక్కు ఉంటుంది. కార్డు మూసివేసి ఆ హక్కును తొలగించిన తర్వాత ఎఫ్‌డీని తీసుకోవచ్చు.

**క్రెడిట్ చరిత్ర లేనివారికీ ఉపయోగం**

ఇంతకుముందు ఎలాంటి క్రెడిట్ కార్డు లేదా రుణం తీసుకోని వారికి కూడా ఈ మార్గం ఉపయోగపడొచ్చు. ఎఫ్‌డీ ఆధారంగా కార్డు తీసుకుని బిల్లులను సకాలంలో చెల్లిస్తే కొత్తగా క్రెడిట్ హిస్టరీ ఏర్పడే అవకాశం ఉంటుంది. అయితే దీన్ని ప్రీపెయిడ్ కార్డుగా భావించ కూడదు. ఎఫ్‌డీ బ్యాంకులో ఉన్నప్పటికీ ప్రతి నెల క్రెడిట్ కార్డు బిల్లు వస్తుంది. దాన్ని సకాలంలో చెల్లించాలి. చెల్లింపు వివరాలు క్రెడిట్ బ్యూరోలకు కూడా వెళ్తాయి.

**యాడ్‌ఆన్ కార్డు కూడా ఒక మార్గం**

మీ జీవిత భాగస్వామి లేదా కుటుంబ సభ్యుడి వద్ద ఇప్పటికే క్రెడిట్ కార్డు ఉంటే యాడ్‌ఆన్ కార్డు తీసుకునే అవకాశం ఉండొచ్చు. అయితే ఇది మీ పేరుతో స్వతంత్ర క్రెడిట్ కార్డు ఖాతా కాదు. ప్రధాన కార్డు ఖాతాదారుడే చెల్లింపులకు బాధ్యత వహిస్తారు.

**ఒకేసారి చాలా కార్డులకు దరఖాస్తు వద్దు**

ఆదాయ పత్రాలు లేకపోతే ఏ బ్యాంకు కార్డు ఇస్తుందో తెలుసుకునేందుకు ఒకేసారి చాలా దరఖాస్తులు చేయడం మంచిది కాదు. ముందుగా అర్హత నిబంధనలు పరిశీలించాలి.మీపరిస్థితికి సరిపోయే మార్గాన్ని ఎంచుకోవాలి.

# దసరా వేళ పాలపిట్టలను బంధిస్తే కఠిన చర్యలు: అటవీశాఖ హెచ్చరిక

**పంజరాల్లో బంధిస్తే పక్షులు ప్రాణాలు కోల్పోతాయని అటవీశాఖ ఆందోళన**

**ప్రమాదకరమైన చైనా మాంజా విక్రయాలను అరికట్టాలని ఆదేశాలు**

**పాలపిట్టను స్వేచ్ఛగా చూడటమే సంప్రదాయమని అధికారుల స్పష్టీకరణ**

**ఆలయాల వద్ద నిఘా పెట్టాలని దేవాదాయ శాఖకు సూచన**



సింధూరదర్శిని: దసరా పండుగ సందర్భంగా పాలపిట్టలను పట్టుకుని పంజరాల్లో బంధించడం, ప్రదర్శించడం వంటి చర్యలను ఉపేక్షించేది లేదని, ఇలాంటి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీ దళాల అధిపతి (హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్) వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నిన్న హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాలపిట్టల సంరక్షణ, ప్రమాదకరమైన చైనా మాంజా నియంత్రణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ.. విజయదశమి రోజు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయం ఉందని, అయితే కొందరు ఇదే అదనుగా వాటిని పట్టుకుని పంజరాల్లో బంధించి ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల పక్షులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతాయని, ఆహారం తీసుకోక బలహీనపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది దసరా సమయంలో బంధించిన 28 పాలపిట్టలను స్వాధీనం చేసుకుని తిరిగి విడిచిపెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాలపిట్టలను బంధించడం వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం నేరమని స్పష్టం చేశారు.

**స్వేచ్ఛగా చూడటమే సంప్రదాయం**

విజయదశమి రోజు పాలపిట్టను చూడాలనే నమ్మకం తరతరాలుగా కొనసాగుతోందని, తెలంగాణ సంస్కృతిలో దీనికి ప్రత్యేక స్థానం ఉందని అధికారులు తెలిపారు. అయితే, ఆ సంప్రదాయం ప్రకారం పాలపిట్టను దాని సహజ ఆవాసంలో స్వేచ్ఛగా ఎగురుతుండగా చూడాలి తప్ప, పంజరంలో బంధించి చూడటం కాదని వారు స్పష్టం చేశారు. దసరా ఉత్సవాలు జరిగే ప్రదేశాలు, ముఖ్యంగా ఆలయాల వద్ద పాలపిట్టలను పంజరాల్లో ఉంచి ప్రదర్శించకుండా పర్యవేక్షించాలని దేవాదాయ శాఖ అధికారులకు అటవీశాఖ సూచించింది. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

**చైనా మాంజాపైనా ఉక్కుపాదం**

ఇదే సమావేశంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో వినియోగించే ప్రమాదకరమైన చైనా మాంజాపైనా అధికారులు చర్చించారు. గాజు పొడి పూసిన ఈ మాంజా వల్ల పక్షులు తీవ్రంగా గాయపడి మరణిస్తున్నాయని, కొన్నిసార్లు మనుషులకు కూడా ప్రాణాపాయం కలిగిస్తోందని వినయ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో చైనా మాంజా అమ్మకాలు, నిల్వలు, వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు సంబంధిత శాఖలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# 52 ఏళ్ల వయసులోనూ ఫిట్‌గా.. సీఎం విజయ్ డైట్ ఇదే!



తమిళనాడు ముఖ్యమంత్రిగా బిజీ షెడ్యూల్‌తో గడుపుతున్న 52 ఏళ్ల విజయ్, ఈ వయసులోనూ ఎంతో ఫిట్‌గా, చురుగ్గా ఉండటానికి గల కారణాలను ఆయన ఫిట్‌నెస్ ట్రైనర్ నరేశ్ కుమార్ వెల్లడించారు. కఠినమైన డైట్ నియమాలు, ఖరీదైన ఆహార పద్ధతులకు బదులుగా, విజయ్ సాధారణ ఇంటి భోజనం, క్రమమైన వ్యాయామంతోనే తన ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని ఆయన వివరించారు. ఈ సింపుల్ విధానమే ఆయన ఫిట్‌నెస్ మంత్రం అని స్పష్టం చేశారు.విజయ్ దినచర్య చాలా నిలకడగా ఉంటుంది. ఆయన సాధారణంగా ఉదయం 5:30 నుంచి 6 గంటల మధ్య నిద్రలేస్తారు. ఉదయం 9 గంటల సమయంలో అల్పాహారంగా రెండు ఇడ్లీలతో పాటు గుడ్లు తీసుకుంటారు. మధ్యాహ్న భోజనంలో అన్నంతో పాటు కూరగాయలు, పండ్లు, ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని ఇష్టపడతారు. రాత్రి భోజనం చాలా తేలికగా ఉంటుంది. ఎక్కువగా సూప్ లేదా సలాడ్ వంటివి తీసుకుంటారు. ఆయన ఫిట్‌నెస్ కోసం రుచిలేని ఆహారాన్ని బలవంతంగా తినే రకం కాదు. తనకు ఇష్టమైన సంప్రదాయ దక్షిణ భారత వంటకాలనే పరిమితంగా తీసుకుంటారు. జంక్ ఫుడ్‌కు పూర్తిగా దూరంగా ఉంటారు. అప్పుడప్పుడు ఇష్టమైన మటన్ బిర్యానీని ఆస్వాదిస్తారు. కొన్ని సందర్భాల్లో తన సన్నిహితుల కోసం ఏర్పాటు చేసే విందుల్లో కూడా బిర్యానీ వడ్డిస్తారని చెబుతారు. అలాగే శక్కరై పొంగల్ వంటి సంప్రదాయ తీపి వంటకాలను కూడా అప్పుడప్పుడు రుచి చూస్తారు. ఆహార నియమాలతో పాటు వ్యాయామానికి కూడా విజయ్ అంతే ప్రాధాన్యత ఇస్తారు. రోజూ వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్‌తో పాటు తేలికపాటి బరువులతో ఎక్కువ రిపిటీషన్స్‌తో కూడిన వెయిట్ ట్రైనింగ్ చేస్తారు. ఒకవేళ జిమ్‌కు వెళ్లడం సాధ్యం కాకపోతే, రోజువారీ శారీరక శ్రమను పెంచుకుంటారు. తీవ్రమైన కసరత్తుల కన్నా, నిలకడగా వ్యాయామం చేయడానికే ఆయన మొగ్గు చూపుతారు. ఈ సమతుల్య జీవనశైలే ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన శక్తిని అందిస్తోందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

# సొహ్రాబుద్దీన్ కేసులో సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించిన నారాయణ

సింధూరదర్శిని: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో 22 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ కింది కోర్టులు ఇచ్చిన తీర్పును పరిశీలించేందుకు అంగీకరించింది. విచారణ సమయంలో 92 మంది ప్రాసిక్యూషన్ సాక్షులు ప్లేట్ ఫిరాయించడంపై ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, ఈ కేసులో గతంలోనే డిశ్చార్జ్ అయిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా విషయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని సీపీఐ సీనియర్ నేత నారాయణ స్వాగతించారు. సొహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్ బీ, సహచరుడు తులసీరామ్ ప్రజాపతి వరుస హత్య లపై సమగ్ర న్యాయ సమీక్ష జరగాలని డిమాండ్ చేశారు. ఈ కేసును విచారిస్తున్న జడ్జి బి.హెచ్. లోయా మరణంపై అప్పట్లో పెద్ద వివాదం అయిందని చెప్పారు. అప్పట్లో గుజ రాత్ హోంమంత్రిగా ఉన్న అమిత్ షా ఈ కేసులో నింది తుడిగా ఉండి, ఆ తర్వాత డిశ్చార్జ్ అయిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కేసును విచారించే న్యాయమూర్తులకు ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించాలని, తద్వారా వారు ఎలాంటి భయాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా విధులను నిర్వర్తించగలరని అభిప్రాయపడ్డారు.



# తిరుమలలో పోటెత్తిన భక్తులు.. శిలాతోరణం వరకు క్యూలైన్లు

-తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

-సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల సమయం

-సోమవారం శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.26 కోట్లు

-వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి శిలాతోరణం వరకు క్యూలైన్లు

తిరుమల, సింధూరదర్శిని: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొన సాగుతోంది. మంగళవారం సైతం భారీ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్ మెంట్లన్నీ నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు విస్తరించాయి. టీటీడీ వెల్లడించిన వివరాల మేరకు, సోమవారం (సెప్టెంబర్ 28) ఒక్కరోజే 84,171 మంది భక్తులు స్వామివారిని దర్శించుకు న్నారు. అంతకుముందు రోజు కూడా దాదాపు అదే సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకోవడం గమనార్హం. సోమవారం నాడు 36,671 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, శ్రీవారి హుండీ కానుకల ద్వారా రూ. 4.26 కోట్ల ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, సోమ వారం నాడు 4.16 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.61 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అశ్విని ఆసుపత్రిలో 3,926 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది. ప్రస్తుత రద్దీ దృష్ట్యా, టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పట్టవచ్చని టీటీడీ అంచనా వేస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి, తదనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# సినిమా న్యూస్



పింక్ బీచ్‌వేర్‌లో మెరిసిపోతున్న జ్యోతి పూర్వజ్. ప్రముఖ నటి జ్యోతి పూర్వజ్ (జ్యోతి రాయ్ అని కూడా పిలుస్తారు) తన ఆకర్షణీయమైన శైలి మరియు ఆహ్లాదకరమైన ఫ్యాషన్ ఎంపికలతో అభిమానులను అలరిస్తూనే ఉన్నారు.

## సీఎం విజయ్ కొడుకు దర్శకత్వంలో సందీప్ కిషన్.. 'సిగ్మా'కు సెన్సార్ పూర్తి

**సందీప్ కిషన్ నటించిన 'సిగ్మా' చిత్రానికి U/A సర్టిఫికేట్**

**తమిళ స్టార్ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం**

**అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల - తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ పంపిణీ**

యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సిగ్మా' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) ఈ చిత్రానికి U/A సర్టిఫికేట్ జారీ చేసింది. దీంతో సినిమా విడుదలకు మార్గం సుగమమైంది. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు సి. జోసెఫ్ విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. నిర్మాత జీకేఎం తమిళ్ కుమరన్ ఈ విషయాన్ని తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. అక్టోబర్ 2న థియేటర్లలోకి రానున్నట్లు తెలుపుతూ, U/A సర్టిఫికేట్ పొందిన కొత్త పోస్టర్‌ను ఆయన పంచుకున్నారు. ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించారు.

ఇటీవల విడుదలైన ట్రైలర్ ప్రకారం.. ఇది యాక్షన్, అడ్వెంచర్, హెయిస్ట్ కామెడీ జానర్‌లో రూపొందింది. రూ. 500 కోట్ల విలువైన డ్రగ్స్, గ్యాంబ్లింగ్ రాకెట్ చుట్టూ కథ నడుస్తుంది. మోసపోయిన హీరో (సందీప్ కిషన్) తన స్నేహితులతో కలిసి ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడు అనేది కథాంశం.

ఈ చిత్రంలో సందీప్ కిషన్‌కు జోడీగా ఫరియా అబ్దుల్లా నటించగా, సంపత్ రాజ్, రాజు సుందరం, శివ పండిట్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. కోస్తా ఆంధ్ర, తెలంగాణలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమాస్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాయి.

స్క్రీన్ ప్లే అంటే ఏంటి? కథకి - స్క్రీన్ ప్లే కి మధ్య ఉండే సంబంధం ఏంటి? సినిమాను చూసే ప్రేక్షకుడికి బోర్ కొట్టిస్తుంది. అందువల్లే స్క్రీన్ ప్లే అనేది చాలా కీలకమైనే చెప్పాలి... అసలు స్క్రీన్ ప్లే అంటే ఏంటి..? ఒక సినిమాని చూస్తున్నంత సేపు అది ప్రేక్షకుడిని వేరే ప్రపంచంలోకి తీసుకెళ్లాలి అలాంటప్పుడే ఆ సినిమా ప్రేక్షకుడిలో ఎంతో కొంత ఇంపాక్ట్ ని క్రియేట్ చేస్తుంది తద్వారా ఆ మూవీ ప్రేక్షకుడికి నచ్చే అవకాశమైతే ఉంటుంది...కథ బాగున్నా కూడా దానికి స్క్రీన్ ప్లే అనేది పర్ఫెక్ట్‌గా సెట్ అవ్వకపోతే సినిమా ఎంగేజింగ్‌గా ఉండదు. సినిమాను చూసే ప్రేక్షకుడికి బోర్ కొట్టిస్తుంది.




అందువల్లే స్క్రీన్ ప్లే అనేది చాలా కీలకమైనే చెప్పాలి... అసలు స్క్రీన్ ప్లే అంటే ఏంటి..? ప్రస్తుతం మన దర్శకులు వాళ్ల ను ఎలా చూపిస్తున్నారు? స్క్రీన్ మీద ప్రేక్షకులు చూసే ప్రతిదీ స్క్రీన్ ప్లే లో భాగమే... ఒక సీన్ లో ఒక యాక్టర్ చెబుతున్న డైలాగులు, ఆ బ్యాక్ గ్రౌండ్ లో ఆర్ట్‌కి సంబంధించిన ఎలిమెంట్స్, వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి. వర్షం పడుతుందా ఎండ కొడుతుందా? ఆ నటుడి కదలికలు ఏంటి? ఇవన్నీ స్క్రీన్ ప్లే కిందికే వస్తాయి...ఆ కథలోని ట్విస్టులను ఎక్కడ రివిల్ చేయాలి అనేది కూడా స్క్రీన్ ప్లే లో భాగమే... కథ అనేది ఏం జరిగిందో వివరిస్తే స్క్రీన్ ప్లే అనేది ఎలా జరిగింది అనేది చూపిస్తుంది... కథ - స్క్రీన్ ప్లే కథకి స్క్రీన్ ప్లేకి చాలా దగ్గర సంబంధం ఉంటుంది. కథ లేకపోతే స్క్రీన్ ప్లే వర్కౌట్ కాదు. స్క్రీన్ ప్లే లేకపోతే కథ బోర్ కొడుతుంది. స్క్రీన్ ప్లే లో ముఖ్యంగా లీనియర్ స్క్రీన్ ప్లే, నాన్ లీనియర్ స్క్రీన్ ప్లే అని రెండు రకాలుగా ఉంటాయి... లీనియర్ స్క్రీన్ ప్లే అంటే కథను స్ట్రెయిట్ గా చెప్పడం, నాన్ లీనియర్ స్క్రీన్ ప్లే అంటే ఎక్కడో మొదలుపెట్టి కథను ముందుకు తీసుకెళ్లడం. లీనియర్ స్క్రీన్ ప్లే కి 'ఒక్కడు' మూవీని మనం ఉదాహరణగా తీసుకోవచ్చు అది స్ట్రెయిట్ నరేషన్ ఉంటుంది. నాన్ లీనియర్ స్క్రీన్ ప్లే కి 'అర్జున్ రెడ్డి' సినిమాను ఉదాహరణగా చెప్పుకోవచ్చు... కథ విషయానికి వస్తే మనం దేనిగురించైతే చెబుతున్నామో అది కథ... ఉదాహరణకు విజయ్ అనే వ్యక్తి ఒక సాఫ్ట్ వేర్ ఉద్యోగి మంచోడు అలాంటి వ్యక్తి ఒక మర్డర్ చేసి జైలు కి వెళ్ళాడు అక్కడ శిక్ష అనుభవిస్తున్నాడు అనేది కథ... స్క్రీన్ ప్లే ప్రకారం విజయ్ జైలు లో పడే ఇబ్బందులను మొదట గా చూపించి అక్కడ అతని మంచితనాన్ని ఎస్టాబ్లిష్ చేసి అక్కడున్న ఎస్పై ద్వారా ఇంతమంచి వాడివి నువ్వు జైలు కి ఎందుకు వచ్చావు అని అడగటంతో అతని ఫ్లాష్ బ్యాక్ ఓపెన్ చేస్తారు...ఇలా చెప్పడం వల్ల రొటీన్ గా కథ చెప్పినట్టుగా కాకుండా డిఫరెంట్ కోణం లో చెప్పిన ఫీల్ కలుగుతుంది. అలాగే విజయ్ మంచోడు కాబట్టి ఆ మర్డర్ చేసి ఉండడు అని ప్రేక్షకుడికి అతని క్యారెక్టర్ తో ముందుగానే చెప్పేయడం. కాబట్టి విజువల్ గా సినిమాను చూసే ప్రేక్షకుడికి దాని మీద ఇంట్రెస్ట్ పెరుగుతుంది... స్క్రీన్ ప్లే తేడా కొడితే సినిమా ఫ్లాప్ అవ్వక తప్పదు. అందుకే దాని విషయంలో డైరెక్టర్లు చాలా కేర్ తీసుకుంటారు... రొటీన్ కథలకు సైతం డిఫరెంట్ స్క్రీన్ ప్లే ను రాసి సక్సెస్ లను సాధించిన సందర్భాలు చాలానే ఉన్నాయి...

## ధర్మ-అధర్మాల పోరాటంలో కర్ణ-అశ్వత్థామల కలయిక!

'కల్కి 2898 ఏడీ' మొదటి భాగం కథలో పాత్రలను, ఆ ప్రపంచాన్ని పరిచయం చేయడానికి ప్రాధాన్యతనిస్తే సీక్వెల్ (కల్కి 2) మాత్రం పూర్తిస్థాయి ధర్మ-అధర్మాల మహా సంగ్రామంగా సాగబోతోందన్నది కాదనలేని నిజం. మొదటి భాగం ముగింపులో సుప్రీమ్ యాస్కిన్ (కమల్ హాసన్) సుమతి (దీపికా పదుకోణే) నుంచి పొందిన సీరమ్ చుక్క ద్వారా యువకుడిగా మారి అమితమైన శక్తిని పొందడం హైలైట్ అయింది. అతడు గాండీవాన్ని చేతిలోకి తీసుకోవడంతోనే పార్ట్-2 కథ, శక్తుల ఘర్షణ నేరుగా ప్రారంభమవుతుంది.

రెండో భాగంలో సుప్రీమ్ యాస్కిన్ పాత్ర మరింత భయానకంగా, శక్తివంతంగా మారనుంది. ఇప్పటివరకు కాంప్లెక్స్ లోపలే ఉంటూ ప్రణాళికలు రచించిన యాస్కిన్ ఇప్పుడు స్వయంగా రణరంగంలోకి దిగుతాడు. భూమిపై మిగిలిన చివరి ఆశాకిరణమైన 'శంభాలా'ను పూర్తిగా నాశనం చేయడం, సుమతి గర్భంలో పెరుగుతున్న కల్కి భగవానుడి జన్మాన్ని అడ్డుకోవడమే అతని ప్రధాన లక్ష్యం. గాండీవం పట్టిన అత్యంత శక్తివంతమైన యాస్కిన్‌ను ఎదుర్కోవడం సాధారణ వీరులకు సాధ్యంకాని పని. కాబట్టి ఈ పోరాటం అత్యంత ఉత్కంఠభరితంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ˜ూశ్రీంశీ =ఝు - సినిమా సక్సెస్ లో కమెడియన్ పాత్ర ఏంటి? ప్రస్తుతం మన దర్శకులు వాళ్ల ను ఎలా చూపిస్తున్నారు? ఈ



సీక్వెల్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం భైరవ (ప్రభాస్) పాత్ర పరిణామక్రమం. కేవలం 'యూనిట్స్' సంపాదించి కాంప్లెక్స్‌కు వెళ్లడమే ధ్యేయంగా బతికే స్వార్థపరుడైన భైరవ, తానెవరో (కర్ణుడి పునర్జన్మ) పూర్తిగా గ్రహించే ప్రయాణం ఇందులో కీలక ఘట్టం. మొదటి భాగం క్లైమాక్స్‌లో కొన్ని నిమిషాల పాటు కనిపించిన కర్ణుడి విశ్వరూపం, రెండో భాగంలో పూర్తిస్థాయిలో బయటపడే అవకాశం ఉంది. తన గత జన్మ జ్ఞాపకాలు, ధర్మం వైపు నిలబడాల్సిన అవసరం భైరవను స్వార్థపరుడి నుండి గొప్ప పోరాటయోధుడిగా మారుస్తాయి. అశ్వత్థామ (అమితాబ్ బచ్చన్) , భైరవల మధ్య అనుబంధం, వారి కలయిక ఈ చిత్రానికి ప్రధాన బలం. ద్వాపర యుగంలో స్నేహితులుగా ఉన్నా? విధి వశాత్తు ఒకరికొకరు దూరమైన కర్ణ-అశ్వత్థామలు కలియుగాంతంలో ధర్మాన్ని, రాబోయే కల్కిని రక్షించడానికి చేతులు కలపడం కథలో అతిపెద్ద మలుపు. సుమతిని కాపాడే బాధ్యతను అశ్వత్థామ భుజాలపై వేసుకోగా.. అతనికి భైరవుడు ఏ విధంగా తోడుగా నిలిచి యాస్కిన్ సైన్యాన్నిఎలా తిప్పికొడతాడనేది విజువల్ వండర్‌గా ఉండబోతోంది. కథకి - స్క్రీన్ ప్లే కి మధ్య ఉండే సంబంధం ఏంటి? సాంకేతికంగా , విజువల్ గా పార్ట్-2 మొదటి భాగాన్ని మించి హైలైట్ అవుతుంది. పురాణాల్లోని దివ్యాస్త్రాలు, భవిష్యత్ కాలపు అధునాతన లేజర్ ఆయుధాలు , రోబోటిక్ సైన్యాల కలయికతో శంభాలా వేదికగా జరిగే యుద్ధం ప్రేక్షకులకు మైండ్-బ్లోయింగ్ అనుభూతినిస్తుంది. కాంప్లెక్స్ బలగాలు శంభాలాపై దాడి చేయడం.. అక్కడ ఉండే రెబెల్స్, అశ్వత్థామ-భైరవలు వారిని అడ్డుకునే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అంతిమంగా సీక్వెల్ కల్కి అవతార ఆవిర్భావంతో కలియుగ ముగింపు సూచనలతో ముగిసే అవకాశం ఉంది. యాస్కిన్ అధర్మాన్ని అంతమొందించి.. నూతన యుగానికి (కృత యుగం) పునాది వేసే ఘట్టాలు కథను పరాకాష్ఠకు చేరుస్తాయి. భైరవుడు తన కర్మను నెరవేర్చి కర్ణుడిగా తన నిందలను తుడిచేసుకోవడం, అశ్వత్థామ చిరకాల శాపం నుండి విముక్తి పొందడం వంటి ఆధ్యాత్మిక, భావోద్వేగ అంశాలతో -కల్కి 2- గొప్ప కావ్యసదృశ ముగింపును అందుకోనుంది.

## ఆయన సినిమా పిచ్చికి హ్యాట్సాఫ్: వినాయక్ స్పీచ్ వైరల్!



విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ఠ జంటగా ఖగేష్ తమ్మినేని దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ డ్రామా అనకాపల్లి. అక్టోబర్ 2న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం గ్రాండ్‌గా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన మాస్ డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడిన మాటలు అందరినీ ఎట్రాక్ట్ చేశాయి. రొటీన్‌గా సినిమా గురించి కాకుండా, ఒక తండ్రి తపన గురించి ఆయన మాట్లాడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. వినాయక్ స్పీచ్ అంతా ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీధర్ చుట్టూనే సాగింది. ఇండస్ట్రీలో అందరికీ సినిమా పిచ్చి ఉంటుందని, కానీ తమందరికంటే శ్రీధర్‌కు ఆ ప్యాషన్ వంద రెట్లు ఎక్కువని వినాయక్ చెప్పుకొచ్చారు. కేవలం వ్యాపార కోణంలో కాకుండా సినిమాను ఒక ఎమోషన్‌గా ఫీల్ అయ్యే వ్యక్తుల్లో ఆయన ముందుంటారని, ఆ డెడికేషనే ఈరోజు అనకాపల్లి లాంటి సినిమాగా మన ముందుకు వచ్చిందని ప్రశంసించారు. కొడుకు విక్రమ్‌ను ఒక పెద్ద కమర్షియల్ హీరోగా చూడాలనేది శ్రీధర్ చిరకాల కోరిక అని వినాయక్ గుర్తుచేశారు. అందుకే విక్రమ్ చిన్నప్పటి నుంచి తాము తీసిన ప్రతి సినిమాలో ఏదో ఒక చైల్డ్ ఆర్టిస్ట్ వేషం వేయించి కెమెరాకు అలవాటు చేశారని చెప్పారు. కొడుకును వెండితెరపై సాలిడ్ హీరోగా నిలబెట్టాలనే ఆయన పదేళ్ల నాటి కల ఇప్పుడు అనకాపల్లితో నెరవేరుతోందన్న ఫీల్ వినాయక్ మాటల్లో స్పష్టంగా కనిపించింది. ఇక్కడ వినాయక్ చెప్పిన మరో ఇంట్రెస్టింగ్ పాయింట్ శ్రీధర్ హోదా గురించి. ఆయనకున్న డబ్బుకి, పలుకుబడికి ఒక సినిమా తీయడం అనేది చాలా చిన్న విషయం అని వినాయక్ అన్నారు. ఇక అనకాపల్లి టీమ్ గురించి మాట్లాడుతూ, త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఒక నిర్మాతగా మారడం మంచి పరిణామం అన్నారు. ఈ చిత్ర దర్శకుడు ఖగేష్ తమ్మినేనితో జనాలను మరీ అంత భయపెట్టకండి అంటూ సరదాగా కామెంట్ చేశారు. సినిమాలో కీలక పాత్ర చేసిన తారక్ పొన్నప్ప కోపంగా ఉన్న లుక్‌ను మెచ్చుకుంటూ, టెక్నికల్ టీమ్ అందరికీ తన బెస్ట్ విషెస్ తెలియజేశారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యి, శ్రీధర్ కళ్లలో ఆనందం చూడాలని వినాయక్ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. విక్రమ్ కచ్చితంగా పెద్ద హీరో అవుతాడని, తన తండ్రి కలలను నిజం చేస్తాడని ధీమా వ్యక్తం చేశారు. రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని మైత్రీ, పూర్వి సంస్థలు అక్టోబర్ 2న రిలీజ్ చేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై బాక్సాఫీస్ దగ్గర మంచి బజ్ క్రియేట్ అయింది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662